క్లుప్తంగా

సాగునీరు విడుదల


నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లారెడ్డి

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్, మైలారం గ్రామాలకు సంబంధించిన సబ్ మైనర్ కాల్వకు ఖాసీంపేట గ్రామంలోని ఉప కాల్వ 8 నుంచి సాగునీటిని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి శనివారం విడుదల చేశారు. సబ్ మైనర్ కాల్వలపై ఆధారపడిన రైతులకు ఇబ్బంది కల్గకుండా ఉపకాల్వల ద్వారా నీరు విడుదల చేయడం జరుగుతోందని, యాసంగిలో పంటలకు ఇబ్బంది లేకుండా మిడ్ మానేరు ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా ఉపకాల్వలకు నీరువిడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, నాయకులు దుడ్డు మల్లేశం, బద్దం ముత్యంరెడ్డి, బద్దం వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ ప్రారంభం

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు సొంత ఖర్చులతో విద్యార్థులకు అల్పాహారం అందించడానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.ప్రమీల, సిబ్బంది సత్యనారాయణరెడ్డి, గీతావాణి, నిత్య, రాజమహేందర్‌రెడ్డి, రాజు, మహేశ్వర్, సురేశ్, ఇందిర, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో మోసం చేయొద్దు

వీణవంక: ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేయొద్దని టీహెచ్‌ఆర్‌టీం వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పని హరీశ్‌వర్మ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. ఆరు గ్యారంటీలపై ప్రజలలో నమ్మకం లేదని కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలన్నారు. యాసంగి సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు రైతుల ఖాతాలో రైతుబంధు డబ్బులు జమ కాలేదని, పెట్టుబడికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సారెస్పీ నీళ్లు వారబందీ పద్ధతిలో కాకుండా నాట్లు పూర్తయ్యే వరకు విడుదల చేయాలని కోరారు. లేదంటే చివరి ఆయకట్టుకు నీరు అందదని, ఇప్పటికే నారు ముదురిపోతుందని వాపోయారు.

నియామకం


కుమారస్వామి

సైదాపూర్: మండలంలో ఐకేపీ ఏపీఎంగా పని చేస్తున్న చెన్నబోయిన కుమారస్వామిని జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా నియమించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌యాదవ్ శనివారం ప్రకటించారు. నియామకానికి కృషి చేసిన శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిసాన్‌పటేల్, కార్యదర్శి రాజు, ముఖ్య సలహాదారుడు శ్రీనివాస్ పటేల్‌కు కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక తరగతులకు ఉపాధ్యాయులు

మానకొండూర్: పదో తరగతి ప్రత్యేక తరగతుల కోసం ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు మండల విద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. మండలంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట ఇతర పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న టీచర్లను సర్దుబాటు చేశామన్నారు. ఎ.రామచంద్రం పచ్చునూర్ నుంచి దేవంపల్లి,అన్నవరం శ్రీనివాస్ వేగురుపల్లి నుంచి వెల్ది, డి. సంధ్య కొండపల్కల నుంచి గంగిపల్లి, ఎం. శ్రీనివాస్‌రెడ్డి ఈదులగట్టెపల్లి నుంచి ఊటూరు, ఎస్. శ్రీనివాస్ ఈదులగట్టెపల్లి నుంచి గంగిపల్లి,వి. శ్రీధర్ వేగురుపల్లి నుంచి వెల్ది ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేశామన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


లైట్లు ప్రారంభిస్తున్న సర్పంచ్ మానస

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో శనివారం కబ్రస్తాన్, మాల వాడలో జీపీ నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను సర్పంచ్ గుండి మానస ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పద్మ, నాయకులు అంజమ్మ, హకీమ్, సోహెల్, ముఖ్రామ్ పాల్గొన్నారు.

ఇదేం గోస..

- వైకల్య పరీక్షలకు స్లాట్ బుకింగ్‌కు లక్కుండాలి
- క్షణాల్లో క్లోజ్ అవుతున్న సైట్
- ఇబ్బందులతో మీ సేవా కేంద్రాలకు చేరుకుంటున్న వికలాంగులు
- ఇతర పనులకు ఆటంకం ఏర్పడుతుందని నిర్వాహకుల ఆవేదన


మీసేవా కేంద్రం వద్ద కిక్కిరిసిన జనం

మానకొండూర్: ప్రమాదవశాత్తు ఇతర కారణాలతో శారీరక వైకల్యానికి గురైనవారు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ పొందడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సదరం సర్టిఫికెట్ ప్రామాణికం కాగా సర్టిఫికెట్లు పొందేందుకు ముందుగా డాక్టర్లతో వైద్య పరీక్షలు అవసరం. పరీక్షలు చేయించుకోవాలంటే వైకల్యం పొందినవారు ముందుగా మీ సేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. ఆ తర్వాతే వైద్య పరీక్షల అనంతరం సదరం సర్టిఫికెట్లు పొందుతారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగానే వైకల్యం ఎంత శాతం ఉందో తెలుస్తుంది. అప్పుడు పింఛన్‌కు అర్హులు అవుతారో కాదో తెలుస్తుంది. వైకల్యం పొందిన వారికి స్లాట్ బుకింగ్ పెద్ద పరీక్షగా మారింది. కిలోమీటర్ల దూరంలోని మీ సేవా కేంద్రాల వద్దకు చేరుకున్నాక క్షణాల్లో సైట్ ఓపెనై క్లోజ్ అవుతుంది. దీంతో ఇటు వైకల్యానికి గురైనవారితో పాటు అటు మీ సేవా నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేం గోస రా బాబు అంటూ వికలాంగులు ఆందోళన చెందుతున్నారు.

డిమాండ్లు

- పాత పద్ధతిలోనే స్లాట్ బుకింగ్ లేకుండా ఆసుపత్రికి వచ్చిన తర్వాతే పరీక్ష చేయాలి.
- ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ అవకాశం ఇవ్వడంతోపాటు బుకింగ్ సమయం పెంచాలి.
- మండలాల వారీగా క్యాంపులు ఏర్పాటు చేసి వైకల్యం ఉన్నవారిని గుర్తించాలి.
- నెలలో ఒకసారి కాకుండా పలుమార్లు స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఇవ్వాలి.
- దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా చూడాలి.

ఉదయాన్నే మీ సేవా కేంద్రాలకు..

సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ఉదయాన్నే మీ సేవా కేంద్రాల వద్ద శారీరక వికలాంగులు వివిధ ప్రాంతాల నుంచి అనేక వ్యయ ప్రయాసలతో చేరుకుంటున్నారు. స్లాట్ బుకింగ్‌కు క్షణాల్లో సైట్ ఓపెన్ కావడం అంతలోనే క్లోజ్ అవుతుండటంతో లక్ ఉన్న వారికే స్లాట్ బుకింగ్ అన్న చందంగా మారింది. సైట్ క్లోజ్ అవడంతో మీ సేవా కేంద్రాలకు వచ్చిన వారు తిరిగి ఇంటికి వెళ్లక తప్పడం లేదు. ఇలా నెలల తరబడి తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు నిర్వాహకులు కూడా తమ విధులకు ఆటంకం ఏర్పడుతుందని, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకోసారి సమయం



చెట్టు మీద నుంచి కింద పడటంతో రెండు చేతులు విరిగాయి. స్లాట్ బుకింగ్ కోసం ఎనిమిది నెలలుగా తిరుగుతున్నా బుకింగ్ కావట్లేదు. నెలకోసారి మాత్రమే స్లాట్ బుకింగ్‌కు సమయం ఇస్తున్నారు. పాత పద్ధతిలోనే పరీక్షలు చేయాలి. - పురం పుష్పలత, శ్రీనివాస్‌నగర్

బుకింగ్ కావడం లేదు



బైక్ నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. చెవులు వినపడటం లేదు. అలాగే ఒక్కోసారి ఏం మాట్లాడుతున్నానో తెలియడం లేదు. వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని మీ సేవా కేంద్రానికి వస్తే స్లాట్ బుకింగ్ కావడం లేదు.

- అలేటి రాజేశం, లింగాపూర్

క్షణాల్లో క్లోజ్ అవుతుంది



బైక్‌పై అదుపుతప్పడంతో కింద పడ్డాను. తలకు గాయం కావడంతోపాటు చేయి విరిగింది. సదరం సర్టిఫికెట్ ఉంటేనే పింఛన్ వస్తదట, రెండు నెలలుగా మీ సేవా వద్దకు వస్తున్న స్లాట్ బుక్ కావడం లేదు. క్షణాల్లో బుకింగ్ క్లోజ్ అవుతుంది.

- పిన్నింటి సుధాకర్‌రెడ్డి, పచ్చునూర్

ఇబ్బంది పడుతున్నాం



సదరం సర్టిఫికెట్ పొందేందుకు ముందుగా మీ సేవాలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. నెలకోసారి సమయం ఇస్తున్నారు. తక్కువ సమయంలో నిర్ణీత సంఖ్యలో బుకింగ్ అవుతున్నాయి. వందల మంది వస్తే ఒకరిద్దరికే బుకింగ్ అవుతుంది.

- ముల్కల సుధారాణి, మీ సేవా నిర్వాహకురాలు

ఆధ్యాత్మికం

అక్షింతల శోభాయాత్ర

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో శనివారం అయోధ్య రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రాముడి అక్షితలను ఊరేగింపుగా శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు శ్రీ రామ భక్తులు తీసుకెళ్లారు. అనంతరం భజనలు చేస్తూ ఇంటింటికీ అక్షితల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్‌లు వీర్ల రవీందర్‌రావు, వీర్ల నర్సింగరావు, ఉపసర్పంచ్ పూదరి వెంకటేష్, పంచాయతీ పాలక వర్గం సభ్యులు, శ్రీరామ భక్త బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: రాములోరి తలంబ్రాలు శనివారం మండలంలోని కన్నాపూర్‌కు చేరుకున్నాయి. రామ భక్తులు గ్రామంలోని వీధుల్లో తలంబ్రాల శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని కాసారంలో అయోధ్య రాముడి అక్షింతలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మండలంలోని ఆచంపల్లి గ్రామంలో అక్షింతలను ఊరేగించి ఇంటింటికి పంపిణీ చేశారు.

హుజూరాబాద్‌రూరల్: అయోధ్య రాములోరి అక్షింతలను పట్టణంలోని వివిధ శాఖాధికారులకు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఆర్డీవో రాజుకు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పాలడుగుల అలేఖ్య, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి, రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సంతోష్‌కుమార్, కేరళ, శాతవాహన, వివేక వర్ధిని పాఠశాలల యాజమాన్యాలకు అక్షింతలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వొడ్నాల విజయ్, ఉపాధ్యక్షుడు యాంసాని శశిధర్ తదితరులు ఉన్నారు.

రేపు సహస్ర దీపాలంకరణ...

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం ఐదు గంటలకు దీపోత్సవం ఉంటుందని, గోదా అమ్మవారిని రంగవల్లికలతో సుందరంగా చిత్రించి, ఆలయాన్ని దీపాలతో అలకరిస్తామని, అనంతరం తిరుప్పావై పాశురాల ప్రబంధం పారాయణం, కుంకుమార్చన, తులసి అర్చన, పుష్పార్చన, విశేష హారతి ఉంటుందన్నారు.


గంగాధర: కాసారంలో అక్షింతల ఊరేగింపు


శంకరపట్నం: కన్నాపూర్‌లో...

వైభవంగా శోభాయాత్ర

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం స్వామివారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు గోదావరిలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ కమిటీ సభ్యులు ఆరట్టు ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో పాటు ఆభరణాల పెట్టెను పట్టణంలోని పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళా భక్తుల కోలాటం, కేరళ బృందం సభ్యులు ప్రత్యేక వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం గణపతి హోమం, మహాపడిపూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, అర్చకులు పాలోజు చరణాచార్యులు, గౌరవ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వెంకన్న, రాజశేఖర్ రెడ్డి, సత్యానందం, రాములు, భాస్కర్, మల్లేశం, మునిందర్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

చొప్పదండి: పట్టణంలోని అయ్యప్ప మాలధారణ భక్తులకు శనివారం దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాలధారణ భక్తులకు భిక్ష నిర్వహించారు. ఏటా చొప్పదండిలో ఈ కార్యక్రమం చేపడగామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్, జహీర్, అబిద్ అలీ, సయ్యద్ ఇర్ఫాన్ ఉల్ హక్, అబ్దుల్ నయీమ్, అలీ బేగ్, చోటే, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై మంత్రి పొన్నం ఆగ్రహం

- ప్రజాపాలన దరఖాస్తు చించేసిన బొమ్మనపల్లి జీపీ కార్యదర్శి
- చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు ఆదేశాలు


కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

చిగురుమామిడి: ప్రజాపాలన దరఖాస్తును చించేసిన పంచాయతీ కార్యదర్శిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. చిగురుమామిడికి చేరుకున్న మంత్రి సర్దార్‌సర్వాయిపాపన్న, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని 17 గ్రామాల ముఖ్య కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. బొమ్మనపల్లి గ్రామ ముఖ్యకార్యకర్తల సమావేశంలో అల్లెపు కనకయ్య తన ఆవేదనను మంత్రికి చెప్పుకున్నాడు. ప్రజాపాలనలో రెండుసార్లు దరఖాస్తు చేసుకోగా జీపీ కార్యదర్శి రమణారెడ్డి దరఖాస్తు చించేశాడని, బొమ్మనపల్లి గ్రామం కాదని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అన్నాడని చెప్పాడు. మంత్రి వెంటనే జీపీ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. దరఖాస్తును ఎందుకు చించావని, ప్రజలకు సేవచేయాల్సిందిపోయి ఇలాంటి పనులేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే సస్పెండ్ చేస్తామని, కనకయ్య ఇంటికెళ్లి దరఖాస్తు స్వీకరించాలని ఆదేశించారు. అంతటితో ఆగకుండా మండలపరిషత్ అభివృద్ధి అధికారి ఎం. నర్సయ్యకు ఫోన్ చేసి తక్షణమే పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు మేమే సేవకులమైనప్పుడు, ఉద్యోగులు కూడా సేవకులే అని అన్నారు. గ్రామాల్లో తప్పనిసరి పర్యటిస్తానని, అత్యవసరాలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జెడ్పీఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్, అధికార ప్రతినిధులు దాసరి ప్రవీణ్‌కుమార్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిసంఖ్యలో హాజరయ్యారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామం జీపీ కార్యాలయం ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంకణాల భగవాన్ రెడ్డి మోటారు వెహికిల్‌చట్టం, డ్రంకెన్‌డ్రైవ్ కేసులపై, అలాగే గృహహింస, ఆస్తి, మహిళల హక్కులకు సంబంధించిన చట్టాలపై కంకణాల విజయరెడ్డి అవగాహన కల్పించారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి స్వాతి లోక్‌అదాలత్‌లో అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, న్యాయవాది భానుకిరణ్, సర్పంచ్ లక్ష్మారెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

డీఈవో జనార్దన్‌రావు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జమ్మికుంట: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలని, రాబోయే పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి(డీఈవో) జనార్దన్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నేబోయిన తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కొడిగూటి తిరుపతి, కొండపాక తిరుపతి, బాబాన్న, మర్రి అవినాశ్, రామస్వామితోపాటు ఇతర మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసుపత్రి పనులు పరిశీలన


పనులను పర్యవేక్షిస్తున్న లలితాదేవి

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్‌లో రూ.1.40 కోట్లతో నిర్మిస్తున్న హాస్పిటల్ భవన నిర్మాణ పనులను శనివారం జిల్లా వైద్యాధికారి లలితాదేవి పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు అవసరమైన గదుల ఏర్పాటుపై సిబ్బందితో చర్చించారు. అనంతరం ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సులోచన, డాక్టర్ బియాబని, డీపీఓ రవీందర్, హెచ్ఈఓ జీవన్‌రెడ్డి, సిబ్బంది జబేర్, ఇహజాజ్, మమత, శ్రీలత, పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మానకొండూర్/మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్‌లో శనివారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. వంద రోజుల్లో ప్రజలకు ఇచ్చిన మాటప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి పథకాలను అమలు జేస్తారని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీపి ముద్దసాని సులోచన, సర్పంచ్ సుదర్శన్, తహసీల్దార్‌రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు. మండలంలో మొత్తం 22,573 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీఓ రాజేశ్వర్‌రావు తెలిపారు.

గన్నేరువరం: మండలంలో ప్రజాపాలన కార్యక్రమానికి 16 గ్రామ పంచాయతీల నుంచి 7,658 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని తాడిజర్రి, ఉప్పరమల్యాల, వెంకంపల్లి, వెంకటాయిపల్లి గ్రామాలలో నిర్వహించిన ప్రజాపాలన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు పథకాలను అమలు చేశామని త్వరలోనే మిగతా పథకాలను అమలు చేస్తామన్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికే ప్రజాపరిపాలన సమావేశాలు ప్రతి గ్రామంలో నిర్వహించి దరఖాస్తులు తీసుకున్నామని, ఈ ప్రక్రియ ప్రతి నాలుగు నెలలకోసారి నిర్వహిస్తామన్నారు. సమావేశాల్లో ఆయా గ్రామాల సర్పంచులు రామిడి కనకవ్వ, బొల్లాడి మంజుల, మల్లేశం, మేఘరాజు, ఎంపీటీసీ ద్యావ మధుసూదన్‌రెడ్డి, పుల్కం నర్సయ్య, పురమల్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో అధికారులు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. వల్భాపూర్‌లో 651కుటుంబాలు ఉండగా 1003మంది దరఖాస్తు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా 26 పంచాయతీలు ఉండగా 14, 518 కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 17,628మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిర్మల్‌రావు, పీఆర్ఏఈ రాంబాబు, సర్పంచ్ రఘుపాల్‌రెడ్డి, ఎంపీటీసీ దేవేందర్, కాంగ్రెస్ నాయకులు సదాశివారెడ్డి, ఉన్నారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ముగిసింది. జమ్మికుంట మున్సిపల్ పరిధి 30 వార్డుల్లో 11,616 మంది దరఖాస్తు చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా జమ్మికుంట మండలంలోని 20 గ్రామాల్లో నుంచి 11,392 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో కల్పన తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

హుజూరాబాద్‌రూరల్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పట్టణంలోని 13వ వార్డులోని ఇందిరానగర్ కాలనీలో చివరి రోజు 350కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత, కాలనీవాసులు పాల్గొన్నారు.

- ఎస్సైకి సన్మానం


పుష్పగుచ్ఛం ఇస్తున్న మారం తిరుపతిరెడ్డి

వీణవంక: వీణవంక ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వంశీకృష్ణను మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మారం తిరుపతిరెడ్డి ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించారు.

- మిస్సింగ్ కేసు నమోదు

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి మల్లారెడ్డి(55) ఎవరికీ చెప్పకుండా ఈ నెల 3న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని, ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, గ్రామ పరిసరాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో లక్ష్మీ ఫిర్యాదు చేసిందని ఎస్సై వివరించారు.

- ఫ్లెక్సీ చించినవారిని శిక్షించాలి

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో 4న ప్రజాపాలన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించేశారని పార్టీ గ్రామ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు శనివారం విచారణ జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల కార్యక్రమాన్ని ఓర్వలేక ఇలా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఫ్లెక్సీ చించిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఉద్యమకారుల వినతి



గంగాధర: తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలని మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన ఉద్యమకారులు కోరారు. జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఇంటిస్థలంతో పాటు నిర్మాణానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలోరవీందర్, అలువాల అమృత్‌లాల్, శ్రీనివాస్, రామాంజనేయులు, నరేశ్, కిషోర్‌కుమార్, పవన్‌కుమార్, జయసింహ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్ర, వ్యవసాయ రుణాలు, ఆయుష్మాన్ భారత్, టీబీ వ్యాధులు, వ్యవసాయంలో ఎరువుల వాడకంపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోషిని సత్యనారాయణ, వార్డు సభ్యులు, బ్యాంక్, వ్యవసాయ,హెల్త్ డిపార్ట్‌మెంట్, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.